# 24. కరైక్కల్ అమ్మయ్యారు

## (కారక్కాల్ అమ్మ)

చోళదేశంలో కరైకల్ అనుగ్రామములో, వైశ్యకులంలో ధన దత్తుడు మంచి వర్తకుడున్నూ, ధనవంతుడున్నూ. సంతానలేమిచే భగవంతుని గూర్చి ధనదత్తుడు, అతని భార్య ప్రార్థింపగా ఈశ్వర కృపచే ఒక కుమార్తె జన్మించింది. ఆమెకు పుణ్యవతి అని నామకరణం చేశారు. పుణ్యవతికి మొదటి నుంచి శివుడన్న, శివభక్తులన్న ప్రీతి మెండుగా యుండేది. తండ్రి ఆమెను పరమదత్తునకు ఇచ్చి వివాహము చేసి, తమకు ఆమె ఒక్కతే పుత్రిక అగుటచే తమ ఇంటి ప్రక్కన ఒక మేడ కట్టించి ఆ దంపతులను ఆమేడలో కాపురముంచారు. అల్లుడు పరమదత్తుడు గూడ మంచి వ్యాపారి. ఒక వ్యాపారమారంభించి విశేషధనము ఆర్జింప సాగాడు. పుణ్యవతి భర్త ఐశ్వర్యమునకు మిడిసిపడక, గర్వపడక శివుని పూజించుచును, శివభక్తులను ఆదరించుచును గడిపేది.

ఒక రోజున పరమదత్తుడు తమ ఇంటికి రెండు మామిడి పండ్లను పంపాడు. వానిని ఆమె జాగ్రత పరచుచుండగా ఒక శివభక్తుడు క్షుధార్తుడై డస్సి వచ్చాడు. అది భోజనమునకు వేళ. అందుచే పుణ్యవతి ఆయనను అర్చించి భిక్ష పెట్టినది. తన దగ్గర ఏమీలేక పోవుటచే భర్తపంపిన రెండు మామిడి పళ్లలో నొకదానిని ఆబిక్షకుని కిచ్చింది. మధ్యాహ్నవేళ అయింది. భర్త పరమదత్తుడు ఇంటికి భోజనానికి వచ్చాడు. పుణ్యవతి భర్తకు భోజనములో రెండవ మామిడి పండును వడ్డించింది. దానిని భుజించి ఇది చాల మధురంగా వుంది రెండవది గూడ వేయుము అని భర్త అడిగాడు. పుణ్యవతికి పాలుపోలేదు. లోనికి బోయి పరమ శివుని ధ్యానించుట మొదలిడింది. పరమేశ్వరుడు కరుణించి ఆమె చేతిలో ఒక మామిడి పండును వచ్చునట్లు చేశాడు. ఆమె ఆశ్చర్యపడి, ఈశ్వరుని కృప అని యెంచి భర్తకు ఆ మామిడి పండును వడ్డించింది. భర్త దానిని గూడ భుజించి - ఇది ఇంకను విశేషముగా మధురముగా నున్నది. ఈ లోకము నకు సంబంధించినట్లుగా తోచదు. ఇది నీకు ఎట్లు వచ్చింది అని అడిగాడు. పుణ్యవతి జరిగినది నిజ

ము చెప్పినది. భర్తనమ్మక - నీవు చెప్పినది నిజమైతే - ఆ పరమేశ్వరునే  అడిగి ఇంకొక పండు తెమ్మనెను. పుణ్యవతి శివుని ప్రార్థించింది. వెంటనే ఇంకో మామిడి పండు - భర్త చూచుచుండగా - ఆమె చేతిలోనికి వచ్చింది. దానిని భర్త చేతిలో పెట్టింది. భర్త చూచు చుండగా ఆ పండు మాయమైపోయింది. పరమదత్తుడు విస్మయుడై ఈ పుణ్యవతి సామాన్య స్త్రీ గాదు. ఈమె ఒక దేవత. ఈమెతో కాపురం చేయటం పాపం అవుతుంది అనుకొని - ఆమెతో నుండ నిచ్ఛగించక విదేశవ్యాపారానికి వెళ్తున్నానని పడవనిండా సరుకులతో, ఆ వూరువిడిచి, పాండ్య దేశంలో ఒక పెద్ద పట్టణానికి వెళ్లాడు. అక్కడ వేరొక వైశ్యస్త్రీని పెండ్లాడాడు. ఒక కూతురు పుట్టింది. కుమార్తెకు మొదటి భార్యపేరు పుణ్యవతి అనుపేరు పెట్టాడు.

పుణ్యవతి బంధువులు ఆమె భర్త వేరొక పట్టణంలో వుండుట చూచి - పుణ్యవతిని పల్లకిలో ఎక్కించుకొని పరమదత్తుని పట్టణమునకు తీసికొని వెళ్లి పరమదత్తుని ఇంటి కి చేర్చారు. పుణ్యవతిని చూడగానే పరమదత్తుడు, తను అతని రెండవ భార్య, తన కుమార్తె తోను పుణ్యవతి కాళ్లపై పడి నమస్కరించారు. భర్త భార్యకు నమస్కరించుట తప్ప అని అక్కడ పెద్దలు చెప్పారు. అతను ఆమెకు దూరముగానుండుటకు, ఇప్పడు ఆమె కాళ్లపై బడుటకు కారణమేమని ప్రశ్నించారు. అతను ఆమెను నేను ఒక దేవతగా నెంచుచున్నాను. బార్యగా పరిగణించలేక పోతున్నాను. ఆమె సామాన్య  స్త్రీ గాదు. ఆమె మహిమ మీకు తెలియదు అని చెప్పాడు.

భర్త మానసిక స్థితిని అర్థము చేసికొని పుణ్యవతి దేవుని పరమేశ్వరా నాభర్తగారి ఆనందము కొఱకై సుందరిగా నుండ కోరాను. భర్తనన్ను తిరస్కరించినారు గనుక నా అందమును తీసివేసి నాకు ప్రేత శరీరమును దయచేయుము అని ప్రార్థించింది. ఆమె అభ్యర్థన వెంటనే అనుగ్రహింపబడినది. ఆమె ప్రేత శరీరముతో అస్థి పంజరముతో నిలి చింది.

బంధువులందరు ఆమె దేవతా స్త్రీయే నని నిశ్చయించుకొని వెళ్లిపోయారు. పుణ్య వతి ఇక్కడ నేనెందుకు అని కైలాసానికి బయలు దేరింది. కైలాసము సమీపిస్తుండగా

ఈ కైలాస పర్వత భూమిమీద కాళ్లతో నడువరాదు అని శిరముతో నడిచి శివుని సన్నిధి చేరింది. మాతృమూర్తి పార్వతీ దేవి ఆమెను చూచి ఆశ్చర్యపడి - ఈ మహాత్ముురాలి చరిత్రము విస్మయముగా నున్నది. ఆమెను గురించి చెప్పవలసినదిగా పరమేశ్వరుని ప్రార్థించింది. ఈమె మనలను రోజూ వినుతించు శీలవతి ఆమెకోరి ఇట్టి దేహమును పొందినది అని ఆమె గూర్చి చెప్పాడు. ఇంతలో పుణ్యవతి ఆది దంపతులను సమీపించి దేవా! నాకు పునర్జన్మ లేకుండునట్లు అనుగ్రహింపుము. ఒక వేళ పునర్జన్మ తప్పని సరి అయిన నాకు మీయెడల అచంచలమైన నిర్మలమైన, శాశ్వతమైన, ఒడలు ఉప్పొంగు గాఢమైన అనితరమైన భక్తి అనుగ్రహించండి. మిమ్ములను ఎన్నడు మరువకుండులాగున, మీరు నృత్యము చేయునప్పుడు మీ పాదముల చెంతనుండి మిమ్ములను కీర్తించుచుండులాగున మీ అనుగ్రహము కృప నాపై నుంచండి అనివేడుకొన్నది.

పరమ శివుడు ఆమెకు ఆవరము ఇచ్చి దక్షిణ దేశంలో తిరువాలంగాడు వెళ్లి అక్కడ నివసించుచు నానృత్యమును చూడుము అని ఆదేశించాడు. ఆమె తిరువాలంగాడు చేరి శివుని సన్నిధిని శివుని కీర్తిస్తూ వుండినది.